# తల్లిదండ్రులకు గుండెకోత వద్దు ..

- అతివేగంగా వాహనాలు నడిపి ప్రాణాలమీదకు తెచ్చుకోవద్దు..
- ఉజ్వలమైన భవిష్యత్‌ను ఆగం చేసుకోవద్దు..
- ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ ..
- మృతుల కుటుంబ సభ్యులకు పరామర్శ.. ఓదార్పు



మృతుల కుటుంబీకులను ఓదారుస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

బన్సీలాల్ పేట్, మార్చి 27: యువకులు అతివేగంగా, నిర్లక్ష్యంగా వాహనాలు నడిపి.. తల్లిదండ్రులకు గుండెకోత మిగల్చవద్దని మాజీమంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. వాహనాలు నడిపేటప్పుడు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ.. నెమ్మదిగా వెళ్లాలని సూచించారు. బన్సీలాల్ పేట్ డివిజన్, బీజేఆర్‌నగర్‌కు చెందిన హర్షిత్ (20), చాచా నెహ్రూనగర్‌కు చెందిన ప్రణయ్ (18)లు బుధవారం తెల్లవారుజామున ప్యాట్నీ చౌరస్తాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే తలసాని గురువారం బీజేఆర్‌నగర్ లోని హర్షిత్ నివాసానికి వెళ్లి మృతదేహం వద్ద నివాళులర్పించిన అనంతరం తల్లిదండ్రులు కనకమాధవ్, విజయలక్ష్మిలను పరామర్శించి.. తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. అనంతరం చాచా నెహ్రూనగర్‌లోని ప్రణయ్ నివాసం వద్ద మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఇరువురికి అతిచిన్న వయసు ఉండటం, ఇరు కుటుంబాలకు కూడా ఒక్కొక్కరే కుమారుడు కావడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యుల రోధనలతో తలసాని చలించిపోయారు. మృతుల కుటుంబాలను పరామర్శించి.. తాను అండగా ఉంటానని ఓదార్చి ధైర్యం చెప్పారు. ఆర్థిక సహాయం అందజేశారు. చేతికి అందివచ్చిన కుమారులు మృతి చెందితే ఆ బాధ ఎవరు తీర్చలేనిదని విచారం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే వెంట డివిజన్ బీఆర్‌ఎస్ అధ్యక్షుడు వెంకటేషన్ రాజు, నాయకులు లక్ష్మీపతి, ప్రేమ్‌కుమార్, నాయకులు బలరాం, నర్సింగ్‌రావు, విజయ్‌శంకర్, నాగభూషణం, విజయ్‌పాల్, అబ్బాస్, సాయి, రంజిత్, తదితరులు ఉన్నారు.

## పిల్లలకు బైక్‌లు ఇవ్వవద్దు..

మృతుల కుటుంబ సభ్యులను పరామర్శించిన అనంతరం చాచా నెహ్రూనగర్‌లో స్థానిక యువకుల తో ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ మాట్లాడారు. అతివేగంగా బైక్‌లు నడపడం, ట్రాఫిక్ నియమాలను పాటించకపోవడం, హెల్మెట్ ధరించకపోవడం, నిర్లక్ష్యంగా డ్రైవింగ్ చేయడంవల్ల చిన్న వయసులోనే యువతీ యువకులు మృత్యువాత పడడం బాధాకరమని అన్నారు. మైనారిటీ తీరని పిల్లలకు తల్లిదండ్రులు బైక్‌లను ఇవ్వకూడదని ఆయన సూచించారు. లైసెన్స్ పొందిన యువకులు జాగ్రత్తగా వాహనాలు నడపాలని, తల్లిదండ్రులకు గుండెకోతను మిగిల్చవద్దని సూచించారు. ఉజ్వలమైన భవిష్యత్తు కలిగిన యువకులు రోడ్డు ప్రమాదంలో మృత్యువాత పడ డం వల్ల రెండు కుటుంబాల్లో తీరని ఆవేదన ను మిగిల్చిందని ఆయన అన్నారు.

## ఎంఈ, ఎంటెక్ పరీక్షా ఫలితాలు విడుదల

ఉస్మానియా యూనివర్సిటీ: ఉస్మానియా యూనివర్సిటీ పరిధిలోని ఎంఈ, ఎంటెక్ కోర్సుల పరీక్షా ఫలితాలను విడుదల చేసినట్లు ఓయూ కంట్రోలర్ ఆఫ్ ది ఎగ్జామినేషన్స్ ప్రొఫెసర్ శశికాంత్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సు రెండు సెమిస్టర్ రెగ్యులర్, అన్ని సెమిస్టర్ల బ్యాక్‌లాగ్ పరీక్షల ఫలితాలను విడుదల చేసినట్లు చెప్పారు. ఈ ఫలితాలను ఓయూ వెబ్సైట్ www. osmania. ac. in లో చూసుకోవాలని సూచించారు.

## మెగా జాబ్ మేళా..

ఉస్మానియా యూనివర్సిటీ: తమ కళాశాలకు చదువు కోసం వచ్చిన విద్యార్థులు ఉద్యోగంతో వెళ్లడం ఆనందంగా ఉందని ఐఎస్‌ఓ కళాశాలల చైర్మన్ వెంకటస్వామి, డైరెక్టర్ వినోద అన్నారు. తార్నాకలోని ఐఎస్‌ఓ కళాశాలలో వివిధ కంపెనీలతో మెగా జాబ్ మేళాను గురువారం నిర్వహించారు. ఈ జాబ్ మేళాకు సుమారు 15 కంపెనీల ప్రతినిధులు హాజరై, విద్యార్థులకు ఉద్యోగాలు అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన వెంకటస్వామి మాట్లాడుతూ.. విద్యార్థులకు విద్యను అందిస్తూనే విద్య పూర్తయిన వెంటనే వివిధ కంపెనీలతో మాట్లాడి జాబ్ మేళాలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఉమా కొంపల్లి, డీన్ మనోహర్, వైస్ ప్రిన్సిపాల్ రాజశ్రీ, ప్లేస్మెంట్ ఆఫీసర్ వినాయక ప్రసాద్, అనురాధతోపాటు విద్యార్థులు, ఐఎస్‌ఓ కళాశాల టీచింగ్, నాన్ టీచింగ్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## డ్రగ్స్ విక్రయిస్తున్న ఇద్దరు అరెస్ట్

అమీర్‌పేట, మార్చి 27 : ఎర్రగడ్డ మెట్రో స్టేషన్ సమీపంలో డ్రగ్స్ విక్రయాలకు పాల్పడుతున్న ఇద్దరిని ఎస్‌టీఎఫ్ బృందం అరెస్ట్ చేసింది. గురువారం సాయంత్రం నిర్వహించిన ఈ దాడుల్లో మహమ్మద్ రహీం, మహమ్మద్ ఫక్రుద్దీన్‌లను అరెస్టు చేసి.. వారి నుండి 2.78 గ్రాముల ఎండీఎంఏ మాదకద్రవ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇదిలా ఉంటే డ్రగ్స్ అమ్మకాలతో సంబంధం ఉన్నట్టు గుర్తించిన సౌదీ అరేబియాకు చెందిన సఫాన్, బెంగళూరుకు చెందిన ఇబ్రహీం లపై కూడా కేసులు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టారు.

## విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలి..



శిబిరంలో విద్యార్థులతో మాట్లాడుతున్న ప్రిన్సిపాల్ శేఖర్

చిక్కడపల్లి, మార్చి 27: డా.బీఆర్ అంబేద్కర్ విద్యాసంస్థలు, డిపార్ట్మెంట్ ఆఫ్ లాంగ్వేజ్ అండ్ కల్చర్ గవర్నమెంట్ ఆఫ్ తెలంగాణ, కల కిరణాలు కల్చరల్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో బాగ్‌లింగంపల్లిలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కళాశాలలో ప్రొడక్షన్ ఓరియేంటెడ్ థియేటర్ యాక్టింగ్ శిక్షణ శిబిరాలు చాలా ఉత్సాహంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా గురువారం నిర్వహణ కన్వీనర్, కళాశాల ప్రిన్సిపాల్ డా. శేఖర్‌మట్ట, కో - కన్వీనర్ కల్చరల్ కోఆర్డినేటర్ సుంకరి నవీన్‌లు మాట్లాడుతూ.. విద్యార్థులు అన్ని రంగాల్లో రాణించాలని అన్నారు. 30 రోజుల పాటు జరిగే ఈ శిబిరంలో కళా రంగాలపట్ల విద్యార్థుల్లో ఉన్న ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులకు కళా రంగంలో ఎలా నటించాలో అని ఒక్క మంచి డ్రామా రూపంలో చూపించే ప్రయత్నం చేస్తున్నామని తెలిపారు . శిబిరంలో మాస్టర్ బిర్రు కిరణ్ శిక్షణ అందిస్తున్నారు.

## సమ సమాజ లక్ష్యసాధనకు సమరశీల పోరాటాలే పునాది

### ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ ఉపేందర్‌రావు, డాక్టర్ దుబ్బ రంజిత్



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఉపేందర్ రావు

ఉస్మానియా యూనివర్సిటీ: విద్యార్థులు ప్రగతిశీల ఆలోచనలకు, ప్రజాస్వామిక విలువలకు నవ యవ్వన విప్లవత్వాన్ని జోడించాలని ఉస్మానియా యూనివర్సిటీ అధ్యాపకులు డాక్టర్ ఉపేందర్‌రావు, డాక్టర్ దుబ్బ రంజిత్ పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ ఓయూ నూతన నిర్మాణ జనరల్ బాడీ సమావేశాన్ని టెక్నాలజీ కళాశాలలో గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఉపేందర్ రా వు, రంజిత్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ.. సమ సమాజ లక్ష్యసాధన కోసం విద్యార్థుల సమరశీల పోరాటాలే పునాది అవుతాయని అన్నారు. శాస్త్రీయ విద్యాసాధన కోసం చిత్తశుద్ధి లేని ప్రభుత్వాల ఆలోచన విధానం ఏమాత్రం పరిపుష్టం కాదని వివరించారు. నిస్వార్థంగా దేశ స్వాతంత్ర్యం కోసం ప్రాణాలర్పించిన అమరుల స్ఫూర్తి పథంలో యువత చైతన్యవంతం కావాలని సూ చించారు. ప్రగతిశీల ఉద్యమాల వేగుధ్రువతారలైన జార్జిరెడ్డి, జంపాల, రంగవల్లి, మారోజుల అమరత్వపు యాదిలో యువతరం కదం తొక్కాలని పిలుపునిచ్చారు. ప్రపంచ శాంతికై, సమత విలువలకై పరితపించే ఉస్మానియా వీరత్వ చైతన్యాన్ని భుజానికి ఎత్తుకొని నూతన కార్యవర్గం ముందు కు నడవాలని పిలుపునిచ్చారు. పీడీఎస్‌యూ ఓయూ నూత న అధ్యక్షుడిగా ఆసిఫ్, ప్రధాన కార్యదర్శిగా మౌనిక, సహా య కార్యదర్శిగా శ్రావణ్, ఉపాధ్యక్షుడిగా సాయి కిరణ్, కోశాధికారిగా షబానా, సభ్యులుగా కిశోర్, అనిల్, సాయి, స్వే చ్ఛ, నవీన్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు మహేశ్, నాగరాజు, నవీన్, శ్రీనివాస్, సంతోశ్, గౌతమ్, ఝాన్సీ, రహీం, తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్

## సీఎం సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలి

బేగంపేట, మార్చి 27 : మెరుగైన వైద్యం కోసం అవసరమైన ఆర్థిక సహాయం పొందడానికి ముఖ్యమంత్రి సహాయ నిధిని సద్వినియోగం చేసుకోవాలని మాజీమంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. గురువారం వెస్ట్ మారేడ్‌పల్లిలోని తన కార్యాలయంలో అమీర్‌పేట, రాంగోపాల్‌పేట డివిజన్‌లకు చెందిన 9 మంది లబ్ధిదారులకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి సీఎంఆర్‌ఎఫ్ పథకంలో మంజూరైన రూ.3.32 లక్షల చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆర్థిక సమస్యల కారణంగా వైద్యం అందించడంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు నామన శేషుకుమారి, అత్తిలి అరుణగౌడ్, బీఆర్‌ఎస్ డివిజన్ అధ్యక్షుడు అత్తిలి శ్రీనివాస్‌గౌడ్, హన్మంతరావు, నాయకులు నామన సంతోశ్‌మణి కుమార్, అశోక్ యాదవ్, కూతురు నర్సింహ, బలరాం, హరిసింగ్, శీనివాస్ పాల్గొన్నారు.

## సీఎంఆర్‌ఎఫ్ చెక్కుల పంపిణీ



బాధిత కుటుంబ సభ్యులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అందజేస్తున్న మహేశ్వర్ రెడ్డి

బొల్లారం, మార్చి 27: సీఎం సహాయనిధి పేద ప్రజలకు ఎంతగానో ఉపయోగపడుతుందని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జక్కుల మహేశ్వర్ రెడ్డి అన్నారు. గురువారం న్యూ బోయిన్‌పల్లిలోని తన కార్యాలయంలో ఒకటో వార్డు పరిధిలోని నేతాజీ నగర్‌కు చెందిన సంధ్యకు రూ.31,500, పెన్షన్ లైన్‌బస్తీకి చెందిన నూర్జహా బేగంకు రూ.25,500, సంజీవయ్య నగర్‌కు చెందిన వాసుకు రూ.9500ల చెక్కులను అందజేశారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మేడ్చల్ ఎమ్మెల్యే మల్లారెడ్డి చొరవతో మంజూరైన మొత్తం రూ.66, 500 విలువగల చెక్కులను బాధిత కుటుంబ సభ్యులకు అందజేసినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రామకృష్ణ, మైనార్టీ ప్రెసిడెంట్ హాసిన్ ఖాన్, విజయ్, ఇమ్రాన్, నరసింగరావు, రాజేశ్, తదితరులు పాల్గొన్నారు.

## పాస్టర్ ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి



మారేడ్‌పల్లి, మార్చి 27 : అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన పాస్టర్ ప్రవీణ్ పగడాల మృతిపై పూర్తిస్థాయిలో పోలీసులు దర్యాప్తు చేసి నిందితులను కఠినంగా శిక్షించాలని క్రైస్తవ ధర్మ ప్రచార పరిరక్షణ సమితి అధ్యక్షుడు జెరూసలేం మత్తయ్య డిమాండ్ చేశారు. గురువారం సికింద్రాబాద్ బాపిస్టు చర్చిలో ఆయన పార్థివ దేహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన అంత్యక్రియల్లో క్రైస్తవ ప్రతినిధులతో కలిసి పాల్గొన్నారు.

## నేడు 'హర్ ఆర్ట్ గ్యాలరీ' డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శన

చిక్కడపల్లి, మార్చి 27: దాశరథి థియేటర్ సుందరయ్య విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ప్రముఖ హస్త కళా కారిణి పి.కమలా ప్రసాదరావు సృష్టించిన, సహస్రాధిక అద్భుత కళా ఖండాలకు నెలవైన 'హర్ ఆర్ట్ గ్యాలరీ' పై నిర్మించిన డాక్యుమెంటరీ చిత్ర ప్రదర్శన శుక్రవారం సాయంత్రం 6 గంటలకు బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్ర ఐలమ్మ ఆర్ట్ గ్యాలరీ హాల్‌లో ప్రదర్శించడం జరుగుతుందని గ్యాలరీ చైర్మన్ , సంస్కృతి రత్న డా.కె.ధర్మారావు, దాశరథి థియేటర్ సభ్యుడు, బీడీఎల్ సత్యనారాయణలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మహిళల కృషికి, మహిళా అభ్యుదయానికి స్ఫూర్తి పేరొందిన, ప్రపంచ వ్యాప్తంగా పేరు గాంచిన ఈ ఆర్ట్ గ్యాలరీ విశేషాలను తెలియజేసే ఈ డాక్యుమెంటరీ చిత్రానికి ప్రముఖ సినీ దర్శకుడు రేలంగి నరసింహారావు దర్శకత్వ పర్యవేక్షణ చేశారని తెలిపారు., చిత్రీకరణ గౌతమ్, ఎంవీఆర్‌ఎస్ఎస్ మూర్తి దర్శకత్వం వహించిన చిత్రానికి , స్క్రీన్ ప్లే ఎడిటింగ్, నిర్మాత సంస్కృతి రత్న ధర్మారావు వ్యవహరించారని తెలిపారు.

## మురుగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి

బన్సీలాల్ పేట్, మార్చి 27 : తరచూ డ్రైనేజీలు నిండిపోయి, మురుగునీరు తాగునీటి పైప్‌లైన్‌లలో కలవడం వల్ల కలుషిత జలాల బారినపడి బస్తీవాసులు రోగాలకు గురవుతున్నారని బన్సీలాల్‌పేట్‌లోని బండమైసమ్మ నగర్, డీ క్లాస్ సేవా సమితి అధ్యక్షుడు బి. మోహన్ రావు అన్నారు. ఈ సమస్యపై జలమండలి, హుస్సేన్ సాగర్ పంప్‌హౌస్ సెక్షన్ మేనేజర్‌కి, డీజీఎం అశిష్‌కు, జీఎం వినోద్‌కుమార్‌లకు పలుమార్లు ఫిర్యాదు చేశామని తెలిపారు. సిబ్బంది వచ్చి తాత్కాలిక చర్యలు తీసుకున్నప్పటికీ ఈ సమస్యకు శాశ్వత పరిష్కారం లభించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం బస్తీకి తాగునీటి సరఫరా జరుగుతుందని, ఇప్పటికే మోరీలు నిండిపోయి డ్రైనేజీ నీళ్లు ఇళ్లలోకి వస్తున్నాయని అన్నారు. గురువారం బస్తీ కమిటీ నాయకులు రంగారావు, జగదీశ్, తదితరులు సమస్య ఉన్న ఇళ్లల్లోకి వెళ్లి పరిశీలించారు. జలమండలి అధికారులు వెంటనే స్పందించి.. సమస్యను పరిష్కరించాలని కోరారు.

## మహిళ లు అన్ని రంగాల్లో రాణించాలి

బేగంపేట, మార్చి 27: మహిళలు అన్ని రంగాల్లో ముందుకు సాగాలని బీఆర్‌ఎస్ నాయకురాలు, మాజీ కార్పొరేటర్ అత్తిలి అరుణ గౌడ్ కోరారు. గురువారం రాంగోపాల్ పేట్ డివిజన్, నల్లగుట్ట కమ్యూనిటీ హాల్‌లో అప్స ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు అరుణ శ్రీనివాస్ గౌడ్ ముఖ్య అతిథిగా హాజరై మహిళలతో కలిసి కేక్ కట్‌చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహిళలు లేక పోతే ఈ సృష్టే లేదని, మహిళలు వారి శక్తిని గుర్తించి ముందుకు సాగాలన్నారు. కార్యక్రమంలో అప్స కోఆర్డినేటర్ బసవరాజు, ఏరియా ఆర్గనైజర్ రాజేశ్వరి,శోభ, తదితరులు పాల్గొన్నారు.

## మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి

చిక్కడపల్లి, మార్చి 27: గాంధీనగర్ డివిజన్‌లో నెలకొన్న మంచినీటి సమస్య పరిష్కారానికి కృషి చేస్తామని స్థానిక కార్పొరేటర్ పావనీ వినయ్‌కుమార్ అన్నారు. డివిజన్‌లోని ధోబీబస్తీ వాసుల విజ్ఞప్తి మేరకు గురువారం ఆమె.. వాటర్ వర్క్స్ అధికారులతో చర్చించి పబ్లిక్ నల్లా కనెక్షన్‌ను తిరిగి పునరుద్ధరించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. డివిజన్‌లో మంచినీటి సమస్యను పరిష్కరించడానికి కృషి చేస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు వినయ్ కుమార్, ఉమేశ్, సాయి కుమార్, ఆనంద్ రావు, బస్తీ వాసులు మల్లికార్జున్, రమేశ్, నాగరాజు, పూజిత, శోభ, సురేశ్, వరమ్మ, సంజీవ, లక్ష్మి పాల్గొన్నారు.

## నవ వధువు ఆత్మహత్య



సౌజన్య (ఫైల్ )

ముషీరాబాద్, మార్చి 27: అత్తింటి వేధింపులు భరించలేక నవవధువు భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నది. ఈ సంఘటన ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం ప్రకారం.. భోలక్ పూర్ నివాసి సౌజన్య(26)కు మూసాపేట్ కు చెందిన జిమ్ నిర్వాకుడు ఏశభరీశ్‌తో నాలుగు నెలల క్రితం వివాహం జరిగింది. కాగా.. సౌజన్య గుండెకు రంధ్రం ఉన్న విషయంపై భర్తతోపాటు, అత్తవారింటి వారు వేధింపులకు గురి చేయసాగారు. అత్తింటి వారి వేధింపులు భరించలేక సౌజన్య గురువారం పుట్టింటికి వచ్చిన ఆమె భవనం మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకుంది. గమనించిన కుటుంబ సభ్యులు ఆమెను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందిందని వైద్యులు ధ్రువీకరించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## నేడు అడ్డగుట్టలో ఉచిత వైద్య శిబిరం

అడ్డగుట్ట, మార్చి 27 : జనహిత సేవా ట్రస్ట్ ఆధ్వర్యంలో అడ్డగుట్టలోని బాబు జగ్జీవన్‌రామ్ భవనంలో ఉచిత వైద్య శిబిరాన్ని శుక్రవారం నిర్వహిస్తున్నట్లు ట్రస్టు ప్రతినిధులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు ఈ వైద్య శిబిరం నిర్వహించడం జరుగుతుందని, జనరల్ ఫిజిషియన్ , ఆర్థోపెడిక్, పీడియాట్రిక్, గైనకాలజీ, షుగర్, బీపీలతోపాటు అన్ని రకాల వైద్యులు ఉంటారని తెలిపారు.

## మందులు పంపిణీ



బొల్లారం, మార్చి 27: కంటోన్మెంట్ రెండో వార్డు రసూల్‌పురాలో క్రియా సంఘ సొసైటీ (కేఎస్‌ఎస్), బోయిన్‌పల్లి రాఘవేంద్ర దవాఖాన సంయుక్త ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా జనరల్, బీపీ, షుగర్, పిడియాట్రిక్,ఆర్థోపెడిక్, సంబంధింత వ్యాధులకు పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చే శారు. కేఎస్‌ఎస్ సంస్థ వ్యవస్థాపకులు షేక్ నయీమ్, వైద్యులు కళ్యాణ్, నాగేశ్వర్, సిబ్బంది జయ శ్రీ, దీప పాల్గొన్నారు

## జాతీయ నాటకోత్సవాలు ప్రారంభం

అమీర్‌పేట, మార్చి 27: ఆంధ్ర నాటక కళాపరిషత్ 96వ వార్షిక జాతీయ నాటకోత్సవాలు గురువారం ఘనంగా ప్రారంభమయ్యాయి. కార్యక్రమాల్లో తొలిరోజు అక్కినేని నాటక కళా పరిషత్ అధ్యక్షుడు సారిపల్లి కొండలరావు, అక్కినేని జీవిత సాఫల్య సాధన పురస్కారాన్ని విశిష్ట అతిథి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ, కమ్మ సంఘం అధ్యక్షుడు చలసాని వెంకటేశ్వరరావు, ఆంధ్ర నాటక కళాపరిషత్ అధ్యక్షుడు బొల్లినేని కృష్ణయ్య, సాహితీవేత్త పోలేటి పార్వతీశం, తదితరుల చేతుల మీదుగా అందుకున్నారు. నాటకోత్సవాల్లో భాగంగా తొలి రోజు ఇంద్రప్రస్థం నాటికను ప్రదర్శించారు.

## హుండీ లెక్కింపు

చిక్కడపల్లి, మార్చి 27: చిక్కడపల్లి శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయంలో హుండీ లెక్కింపును గురువారం నిర్వహించారు. 63 రోజులగాను ఆదాయం రూ.16,22 ,154 వచ్చిందని ఆలయం వ్యవస్థాపక కుటుంబ సభ్యుడు శ్రీనాథ్ గౌడ్, కార్యనిర్వహణ అధికారి అన్నపూర్ణలు తెలిపారు.

## 2న బీసీల పోరు గర్జనను జయప్రదం చేయాలి

### 31న ఢిల్లీకి వెళ్లడానికి సికింద్రాబాద్‌లో ప్రత్యేక రైలు

### బీసీలంతా తరలిరావాలి..

### తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ



సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజు

చిక్కడపల్లి, మార్చి 27: ఏప్రిల్ 2న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద నిర్వహించే బీసీల పోరు గర్జనను జయప్రదం చేయాలని తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజు గౌడ్, రాష్ట్ర కన్వీనర్ అయిలి వెంకన్న గౌడ్‌లు పిలుపునిచ్చారు. గురువారం చిక్కడపల్లిలోని సమన్వయ కమిటీ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్లను స్థానిక సంస్థల్లో, విద్య, వైద్యం, ఉపాధి రంగాల్లో అమలు చేస్తున్నట్లు అసెంబ్లీలో చట్టం చేసి పార్లమెంట్‌కు పంపించిందన్నారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం పార్లమెంట్‌లో కూడా 9వ షెడ్యూల్‌లో చట్టం చేసేందుకు ఏకగ్రీవ తీర్మానం చేయాలని డిమాండ్ చేస్తూ ఏప్రిల్ 2న అన్ని బీసీ కులసంఘాల ఆధ్వర్యంలో పోరు గర్జన నిర్వహిస్తున్నామని తెలిపారు. దేశవ్యాప్తంగా జన గణనలో కులగణన చేయాలని డిమాండ్ చేశారు. ఏప్రిల్ 2 న దేశ రాజధాని ఢిల్లీలో సర్వాయిపాపన్న 315వ వర్ధంతిని కూడా ఘనంగా నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. మార్చి 31న సికింద్రాబాద్ రైల్వే స్టేషన్లో ఉదయం 7గంటలకు ప్రత్యేక రైలును ఏర్పాటు చేశామని, బీసీలంతా తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ పోరు గర్జనలో రాహుల్ గాంధీ, అఖిలేశ్ యాదవ్‌తోపాటు అన్నిపార్టీల ఎంపీలు పాల్గొంటారని తెలిపారు. విలేకరుల సమావేశంలో సమన్వయ కమిటీ వైస్ చైర్మన్ గడ్డమీది విజయ్‌కుమార్‌గౌడ్, బాలగౌని వెంకటేశ్‌గౌడ్, సుగూరి దుర్గయ్య గౌడ్, నాగభూషణం, సింగం నాగేశ్‌గౌడ్, పోతగాని అయిలేని గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

## బాగ్‌లింగంపల్లిలో అన్నదానం



సంఘ సేవకుడు గుండగోని మైసయ్య 26 వర్ధంతి సందర్భంగా బీజేవైఎం సీనియర్ నాయకుడు కిరణ్ ఆధ్వర్యంలో గురువారం బాగ్‌లింగంపల్లిలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కోవా రాహుల్, కార్పొరేటర్లు పావనీ వినయ్ కుమార్, సుప్రియ నవీన్ గౌడ్, సరళ , రఘువీర్ ఉపేందర్, భరత్ భూషణ్, నితిన్ గౌడ్, వీరయ్య, జక్క శ్రీనివాస్, జైపాల్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు. – చిక్కడపల్లి, మార్చి 27

## గిరిజన భూనిర్వాసితులకు న్యాయం చేయాలి

ఉస్మానియా యూనివర్సిటీ: సింగరేణి గిరిజన భూనిర్వాసితులకు తక్షణమే న్యాయం చేయాలని లంబాడా ఐక్యవేదిక ఓయూ విద్యార్థి నాయకుడు రాజేశ్ చౌహాన్ డిమాండ్ చేశారు. గిరిజనుల ఇళ్లకు సింగరేణి యాజమాన్యం వెంటనే నష్టపరిహారం చెల్లించాలని కోరారు. ఈ డిమాండ్లతో అసెంబ్లీ ముట్టడికి బయలుదేరగా ఓయూ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో గిరిజన విద్యార్థి నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా రాజేశ్ చౌహాన్ మాట్లాడుతూ.. హైకోర్టు స్టే ఆర్డర్ జారీ చేసినప్పటికీ గిరిజనుల ఇళ్లను సింగరేణి యాజమాన్యం కూల్చివేసిందని మండిపడ్డారు. సింగరేణి నిర్లక్ష్య వైఖరికి నిరసనగా అసెంబ్లీ ముట్టడికి ప్రయత్నించినట్లు చెప్పారు. దాదాపు 80కి పైగా గిరిజన కుటుంబాల ఇళ్లకు ఎలాంటి నష్టపరిహారం చెల్లించకుండా, న్యాయం చేయకుండా సింగరేణి యాజమాన్యం మొండిగా కూల్చివేసి, భూములను స్వాధీనం చేసుకుంటుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై మంత్రులు మల్లు భట్టి విక్రమార్క, దుద్దిల్ల శ్రీధర్ బాబు తక్షణమే స్పందించాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు న్యాయం జరిగే వరకూ రాష్ట్రంలోని అన్ని గిరిజన, ప్రజా సంఘాలతో కలిసి అసెంబ్లీ, ప్రజాభవన్, సింగరేణి భవన్, రాజ్ భవన్ ముట్టడించనున్నట్లు తెలిపారు.

## ఖాళీగా ఉన్న ఆస్తులపై 50 శాతం ఆస్తిపన్ను రాయితీ



కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌కు వినతిపత్రం అందజేస్తున్న రాజీవ్ రహదారి ప్రాపర్టీస్ ఓనర్స్ జేఏసీ చైర్మన్ తేలుకుంట సతీశ్ గుప్తా, సభ్యులు

మారేడ్‌పల్లి, మార్చి 27: రాజీవ్ రహదారి ఎలివేటెడ్ కారిడార్ ప్రాజెక్ట్‌లో ఉన్న ఆస్తులు, కట్టడాలకు ఆస్తి పన్ను నుంచి మినహాయింపు ఇస్తున్నట్లు కంటోన్మెంట్ బోర్డు సీఈఓ మధుకర్ నాయక్ ప్రకటించారు. ఈ మేరకు రాజీవ్ రహదారి ప్రాపర్టీ ఓనర్స్ జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) చైర్మన్ తేలుకుంట సతీశ్ గుప్తా, సభ్యులు.. బోర్డు సీఈఓకు వినతిపత్రం అందజేశారు. ఎలివేటెడ్ కారిడార్ల నిర్మాణం శంకుస్థాపన జరుగగానే చాలా వరకు దుకాణాలు, భవనాలు ఖాళీ అయ్యాయని బోర్డు సీఈఓకు వివరించారు. ఈ ప్రాజెక్టు కారణంగా అనేక మంది కిరాయిదారులు పలు వ్యాపార సముదాయా ల భవనాలను ఖాళీ చేయడంతో, భవన యజమానులు ఆస్తి పన్ను భారం భరించలేకపోతున్నారని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన బోర్డు సీఈఓ మధుకర్ నాయక్.. ఖాళీగా ఉన్న ప్రాపర్టీలు ( వ్యాపార సముదాయాల భవనాలు)పై 50 శాతం రాయితీ ఇస్తున్నట్లు ప్రకటించారు. ఈ రాయితీ కోసం ప్రాథమిక అర్హతగా, ప్రాపర్టీ యజమానులు తమ పన్నులను ఇప్పటి వరకు పూర్తిగా చెల్లించి ఉండాలని, పన్నులు బకాయిలు లేని యజమానులకే ఈ 50 శాతం రాయితీ వర్తిస్తుందని సీఈఓ వెల్లడించారు. అదేవిధంగా పాత, ప్రస్తుత విద్యుత్ బిల్లులను జతపరిచి ప్రస్తుతం ఖాళీగా ఉన్న వ్యాపార సముదాయ భవనాల యజమానులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని జేఏసీ చైర్మన్ సతీశ్ గుప్తా కోరారు. ఈ సమస్యపై తక్షణమే స్పందించి 50 శాతం రాయితీ నిర్ణయం తీసుకున్న బోర్డు సీఈఓ మధుకర్ నాయక్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

## అనుమతులు లేని నిర్మాణాలపై చర్యలు



బొల్లారం, మార్చి 27: కంటోన్మెంట్ బోర్డు నిబంధనలకు విరుద్ధంగా అనుమతులు లేకుండా నిర్మాణాలు, కబ్జాలకు పాల్పడితే ఉపేక్షించేది లేదని కంటోన్మెంట్ బోర్డు చీఫ్ ఇంజినీర్ కుమార్ ఉమా శంకర్ హెచ్చరించారు. గురువారం బోయిన్‌పల్లి ఆరో వార్డు పరిధిలోని భావన నగర్, ఉమానగర్ కాలనీలో ఓ భవన యజమాని అనుమతులు లేకుండా చేపట్టిన నిర్మాణాన్ని కంటోన్మెంట్ బోర్డు సీఈవో మధుకర్ నాయక్ ఆదేశాల మేరకు బోర్డు ఇంజినీరింగ్ అధికారులు దినేశ్ , సాగర్ జిష్ణు ఆధ్వర్యంలో కూల్చివేసి.. మరో రెండు భవనాలకు నోటీసులు జారీ చేసి సీజ్ చేశారు. సందర్భంగా వారు మాట్లాడుతూ.. భవిష్యత్తులో అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టినా, కబ్జాలకు పాల్పడి నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ కూల్చివేతల్లో బోర్డు ఇంజనీరింగ్ అధికారులు కృష్ణ కాంత్ రెడ్డి, సిబ్బంది , తదితరులు పాల్గొన్నారు .

## ఆత్మహత్యాయత్నం..

మారేడ్‌పల్లి , మార్చి 27: ఆత్మహత్య చేసుకోవడానికి రైలు పట్టాలపై నడుచుకుంటూ వెళ్తున్న ఓ మహిళను రైల్వే పోలీసులు రక్షించి.. కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ సంఘటన సికింద్రాబాద్ రైల్వే పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. రైల్వే పోలీసుల వివరాల ప్రకారం... నగరంలో ఉంటున్న గృహిణి (40) కులాంతర వివాహం చేసుకుంది. వారికి ఇద్దరు సంతానం. కాగా కుమార్తె మానసిక వికలాంగురాలు కావడంతో ఆమెను చూసుకోవడానికి తల్లి ఇంటి వద్దనే ఉంటూ కుమార్తె బాగోగులు చూసుకుంటుంది. అయితే భర్త గత సంవత్సరంగా పనులకు వెళ్లకుండా ఖాళీగా ఉంటుండడంతో ఆర్థిక సమస్యలు తలెత్తాయి. దీంతో కుటుంబంలో భార్యాభర్తల మధ్యన తరచూ గొడవలు జరుగుతున్నాయి. ఇదే క్రమంలో భర్తతో గొడవ కావడంతో మనస్తాపానికి గురై..తాను ఆత్మహత్య చేసుకుంటున్నానని ఇంట్లో లేటర్ రాసి ఉంచి గురువారం మధ్యాహ్నం సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌కు చేరుకుంది. అక్కడి నుంచి రైలు పట్టాల పై వెళ్తుండగా అక్కడున్న జీఆర్పీ, ఆర్పీఎఫ్ పోలీసులు గుర్తించి.. రైల్వే పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లి..కుటుంబ సభ్యులకు అప్పగించారు.